

## శ్రీ శ్రీనాథశాస్త్రి

దేశములో అందరు యువకులకూ పెళ్లి అయినట్టే శ్రీకంఠరావుకు కూడా పంధొమ్మిదో యేట పెళ్లి అయింది.

పెళ్లినాటికి లక్ష్మీదేవికి పన్నెండేళ్లుంటవి. ఈడూ జోడూ – అంతా – అన్నివిధాలా యెంతో బాగుందని పెళ్లికివచ్చినవారంతా సంతోషించినారు. ఆ దంపతులు యువతీయువకులందరికీ లక్ష్యమవుతారని లోకానుభవము గల పెద్దలు నిశ్చయించారు.

పిల్లకు పద్ధెనిమిదో సంవత్సరము వచ్చేవరకూ గర్భాధానము చేసుకోననీ – అంతవరకూ యింగ్లీషుబళ్లో చదివించవలసిందనీ పెండ్లి కుమారుడు షరతుగా చెప్పివాడని పుకారు పుట్టింది.

ఎందు కిన్ని విషయాలు! ఆ వివాహములో జరిగిన యావద్విషయాలకూ అటు వృద్ధులూ యిటు యౌవనులూ సంతోషించినారు. ఈవిధంగా పెళ్లిళ్లు జరిగితే లోకకల్యాణముగా వుంటుం దన్నారు.

అంతా యింతసంతోషముతో వున్నా పిల్ల దాని పినతాతగారు మాత్రము కొంత గునుస్తూ వున్నాడు... ఆయన నాస్తి శబ్దవాచ్యుడనీ – శుభం ఎప్పుడూ పలకలేనివాడనీ ఆయనమాటలు ఎవరూ లెక్కచేయలేదు... అయితే పిల్లవాడివైపునకూడా తత్తుల్యమయిన వృద్ధు డొకాయన – పిల్లవాడి మాతామహుడున్నాడు. వారిద్దరూ ఒకచోట చేరినారు.

మాతామహుడు పితామహుణ్ణి "ఏమండీ... ఈ సంబంధం విషయంలో తమకేదో కొంచెం సంకోచంగా వుందని విన్నాను... నిజమేనా?" అని అడిగినాడు.

"నిశ్చయమయింది. అంతా అయిపోయింది. యిప్పుడా విషయాలు మనం ఆలోచించి ఏం ప్రయోజనం?" అన్నా డీ ముసలివాడు.

"అల్లా కాదు. మీ అభిప్రాయం సెలవీయండి. అది నివారించడాని కేమయినా అవకాశంవుంటే ఆలోచింతాము – చెప్పండి. మనం పెద్దవాళ్లం వున్నాం కాబట్టి ఏదయినా యిట్లాంటి విషయం – అందులో అనుభవజ్ఞులు తమకు తోచినప్పుడు తెలుసుకోకపోవడంకన్నా తెలివితక్కువ వుంటుందా? మీ రిక చెప్పక తప్పదు."

" అది నివారించడానికి వీలయ్యేదే అయితే నాకు సందేహమే వచ్చేదికాదు...అయినా యింతగట్టిగా అడుగుతున్నప్పుడు చెప్పక తప్పదు. మా సంప్రదాయం వేరు, మీ సంప్రదాయం వేరు, అంతే. అంతకన్నా నాకేమీ సందేహం లేదు. మావాళ్లు పద్దాలుగు పదిహేను పుర్షాంతరాలనుంచి రాజాశ్రిములోవున్న లౌక్యులు...మీవాళ్లో శాస్త్రమో - వేదమో చదువుకొని జీవనం చేశారు."

"ఓ. ఇదా మీ సందేహం. అయితే పరవాలేదు. ఈకాలంలో అంతా తారుమారయి పోయింది. ఈకాలంలో లౌక్యమేమిటి వైదిక మేమిటి? అసలు సంఘమే తారుమారయి పోతూవుంటే...సరె లేండి.

*    *    *

లక్ష్మీదేవి స్కూలు ఫయిఃలు పరిక్షఅయింది. అతను యింజనీరింగ్ పరిక్షయిచ్చి వచ్చినాడు. అతనికి పరిక్ష పోవడమ్మంటూవుండదు. అందుకోసం ఉద్యోగప్రయత్నములో వున్నాడు.

బుడమేటికి ఒక ప్రాజెక్టు కట్టడానికి అప్పుడే మద్రాసు గవర్నమెంటువారు నిశ్చయించినారు. ఆ ప్రాజెక్టును నిర్మాణముకోసం ప్రత్యేకముగా డిపార్టుమెంటు పెట్టినారు. అందులో శ్రీకంఠరావును అసిస్టెంటుగా తీసుక్కొన్నారు.

కాలప్రవాహములో వివాహము నాటి షరతులు కొట్టుకొని పోయినవి. పదిహేడు సంవత్సరము లయినా వెళ్లక పూర్వమే శ్రీకంఠుడు భార్యను కలసినాడు. అయితే సంసారనౌక మాత్రము యింకా సాగలేదు.

నివాసానికి ఏటిఒడ్డున బంగళాలు కట్టగానే అతను గృహిణిని తీసుకొనివచ్చి సంసారయాత్ర ప్రారంభించ దలచినాడు.

ఒకచెంప బంగాళాలు కడుతున్నారు. మరొకచెంప యిన్వెస్టిగేటింగ్ యింజనీరుగా వచ్చిన దొరతో ఏటి పుట్టుపూర్వోత్తరాలు ప్రత్యక్షముగా నెలమీద చూడడానికి అతను వెళుతూవున్నాడు. రోజూ కనీసం - యిరవై మయిళ్లయినా యిద్దరూ తిరిగి చూస్తూవున్నారు.

నీటి పారుదలకోసం నిర్మించే ప్రాజెక్టుల విషయములో బ్రిటీషు యింజనీర్లకున్నూ - యితర యిరోపియన్ యింజనీర్లకున్నూ చాలా అభిప్రాయభేదా లున్నవి. బ్రిటీషు యింజనీర్లు యెంతసేపున్నూ ప్రవాహానికి ఒకయెత్తయిన ప్రదేశములో ఒక ఆనకట్ట కట్టి ప్రావాహాన్ని నిర్బంధించి కాలవలు తవ్వి ఆ కాలవలలోకి నీళ్లు పొయ్యేట్టు చేసి సేద్యానికి నీటిని సరఫరా చేయడము అలవాటు. ఇతర యింజనీర్లు - అందులో వరిపంట పండించడములో ఆరితేరిన యిటాలియన్ యింజనీర్లు జలాశయాలు నిర్మించి ఆజలాశయాలలోకి నీళ్లు వచ్చేట్టుచేసి వాటికింద భూమి సాగుఅయ్యేట్టు చేయడము అలవాటు.

ఇప్పుడు ప్రాజెక్టు కట్టదలచుకొన్న బుడమేరు యేటికి యేడాదీ ప్రవహించే ప్రవాహము కాదు. ఎప్పుడో ఒకప్పుడు వరదవస్తుంది. వరదరావడము అంటే మహాప్రళయముగా అయిపోతుంది. వేలకొద్దీ యకరాలు యేకార్ణవము లాగ చేసివేస్తుంది. మాసాల పర్యంతమూ రునీ నేలమీద నిలవవుంటుంది. ఆ భూములలో ఒక్క యెండాకాలములో మాత్రమే ఏదయినా పయిరు చేయడానికి సాధ్యమవుతుంది.

ప్రాజెక్టు డిజయిన్ చేయడానికి వచ్చిన యింజనీయరు యింగ్లీషువాడు. ఆయనకు జలాశయ (Carchment) నిర్మాణ విషయము తెలియదు. ఎన్నడో ఎడాదికొక నాడు వచ్చే మహాప్రవాహానికి మరొక పద్ధతిలో ప్రాజెక్టు నిర్మించడానికి వీలులేదు. అసిస్టెంటుగా వచ్చిన శ్రీ కంఠరావు యింగ్లీషు యింజనీరింగు చదివినా ఆపద్ధతి గిట్టనివాడు. అతని ప్రతిభఅంతా యీ సమయములో చూపించ దలచుకొన్నాడు.

ఒక్క జలాశయము నిర్మించడమే కాకుండా పది పదిహేను మయిళ్లకొక జలాశయము చొప్పున మూడు జలాశయములు నిర్మించి యేటిజాలే ఫీడింగ్ ఛానల్ గానూ, పొర్లుపోవడానికి పెట్టేకళింగులాలనే మళ్లీ యేటిజాలులోకే వదిలి, రెండో జలాశయానికి దాన్నే ఫీడింగ్ ఛానలుగానూ చేయవలెననీ అదే విధముగా మూడో జలాశయాన్నికూడా నిర్మించవలెననీ శ్రీ కంఠరావు వూహించినాడు. ఇంజనీరు ఆ ఊహను యెంతో మెచ్చుకొన్నాడు. పయిగా యేరంతా "కాంటూరు"గావుంది. సాగుకు కాలవలన్నీ "రిడ్జి" కాలవలవుతవి. ఇక యింజనీరుకు కలిగి సంతోష మింతంతకాదు.

గంటలమీద పనికావలెనని దొర తొందరచేస్తున్నాడు.

భూమి సర్వేఅంతా యింకా పూర్తికాలేదు. శ్రీ కంఠరావు ప్రతిభకు దొర మెచ్చుకొని యావత్తుపనీ వప్పచెప్పి నివాసానికి బంగళాల పనిమాత్రము తాను చూస్తూ వున్నాడు.

రోజులు గడిచిన కొద్దీ భోజనాదికానికి శ్రీ కంఠరావు యిబ్బంది పడుతున్నాడు. భార్య తన్నుతీసుకొని వెళ్లమని తెగ వుత్తరాలు వ్రాస్తుంది. తొలకరించింది. ఒకటి రెండు జల్లులు పడ్డవి కూడాను. బంగళా తయారయింది. కనిచూపు మేరలో ఎక్కడా ఒకయిల్లూ వాకిలీ లేదు. దూరంగా కొండలూ తిప్పలూ తుమ్మచెట్లూ కనిపిస్తవి. ఒక అరమైలు దూరంలో ఎక్కడో ఆకాశాన వున్నట్టుగా గుణదల రైల్వేస్టేషన్ మాత్రము కనిపిస్తుంది.

అక్కడ ఆబంగళాలో శ్రీ కంఠరావు సంసారయాత్ర ప్రారంభించినాడు.

## ౨

ఉదయం తొమ్మిదిగంట లవుతుంది. ఎవరో భోజనానికి వస్తారనీ కాస్తా కూరా గీరా చేయమని వర్తమానం వచ్చింది. నౌకరు ఆచుట్టుపక్కల చప్పున దొరికిన నాల్గు కూరలూ - ఒక అనపకాయ - ఒక గుమ్మడికాయ - ఇన్ని దోసకాయలు - ఇన్ని వంకాయలూ తెచ్చి పడవేసినాడు.

లక్ష్మీదేవి సర్కారు పరిక్షకు పోయినప్పుడు కూడా యింత కంగారు పడలేదు. భోజనానికి వచ్చేది యెవరో యింజనీరు అయివుంటాడనుకొన్నది. భోజనంలోకి ఏం తయారుచేయవలెనో తోచడంలేదు. కాలుగాలిన పిల్లిలాగా అటూ యిటూ తిరిగింది. చప్పున వాళ్ల అమ్మమ్మ జ్ఞాపకము వచ్చింది. ఆమెది అమృతహస్తము. అందులో లక్ష్మీదేవి సంసారానికి బయలుదేరడానికి ముందురోజున వాళ్లయింట్లో ఒక శ్రాద్ధమువస్తే ఆ శ్రాద్ధమునకు వంటచేసినట్టూ అవుతుంది - మనమరాలిని పంపించినట్టూ అవుతుందని వచ్చి వంటచేసింది. అది ఎంతో సమయానుకూలముగా లక్ష్మీదేవికి జ్ఞాపకం వచ్చింది.

నాల్గుపొయిలు రాజవేసింది.

మామూలుగా ఆడవాళ్లనుచూస్తే అగ్నిహోత్రుడు గడగడ లాడుతాడు. కాని యీమధ్య యింగ్లీషు చదువుకొన్న ఆడవాళ్లను చూసి కాస్త బెట్టుచేసి అప్పుడప్పుడు ఏడిపిస్తూ వున్నాడు - ఏమంటే యీ పుణ్యభూమిలో యీ యింగ్లీషు చదువుకొన్నవాళ్లు నిత్యాగ్నిహోత్రాన్ని మానివేసినారని ఆయనకు విపరీతమయిన కోపము.

ఆస్థితిలో ఆమె ముక్కును వరుణదేవుడు వరించినాడు. ఆమె వద్దో కుయ్యోమొర్రో మంటూవుంటే ఏకధారగా ఆమె ముక్కులలో నుంచి బయటికి వస్తూ వున్నాడు. అగ్నిహోత్రుడామె నేత్రాల నాశ్రయించినాడు. ఆశ్రయించడ మేమిటి? వాటితో అవినాభావ సంబంధము యేర్పరుచుకొన్నాడు. ఇక తక్కిన దేవతల సంగతి చెప్పవలెనా? అష్టదిక్పాలురూ ఆమెను కౌగలించుకొన్నారు.

ఒంటిగంట కావచ్చింది. ఇంకా వంటపూర్తి కాలేదు. శ్రీ కంఠరావూ అతనితో అంతే వయసువాడు మరొకరూ బంగళాకు వచ్చినారు. వచ్చే రావడముతో శ్రీ కంఠరావు లోపలికి వచ్చినాడు. ఆనాడు విష్ణుమూర్తి సహచర్యము చేసినది మొదలు యీనాటి వరకున్నూ లక్ష్మీదేవి వంటకోసం యింతబాధ పడ్డట్టు యెక్కడా ఎవరికీ తెలియదు - శ్రీ కంఠరావు పాపము లక్ష్మీదేవిని చూసినాడు. ఆరూపానికీ - ఆస్థితికీ పక్కుననవ్వు వచ్చింది. నవ్వినాడు. ఆ నవ్వుకు "భగ్గనదరిక్కొన్న హుతాశ[illegible]" లాగా అయిపోయింది. "ఏమిటండీ ... హఠాత్తు[illegible] కబురు చేస్తే ఎలాగా? చచ్చిపోతున్నాను" అన్నది లక్ష్మీదేవి.

"సరేలే, యింతకూ యెట్లాగొట్లా చేశావు. మేం స్నానం చేసేలోపల నీవు ఏదో చీరే గీరే మంచిది కట్టుకో ఎంతో అసహ్యంగా వున్నావు" అని చెప్పి స్నానానికి బయలుదేరినాడు.

భోజనానికి కూర్చున్నారు. విస్తరిలో మొట్టమొదట ప్రవేశించింది అన్నము.

అతిథి మందహాసం చేస్తూ "మీ అత్తవారిది వైష్ణవ సంప్రదాయమా" అని ప్రశ్నించినాడు.

ఆ మాటకు అర్థము తెలిసినా తెల్లబోయి నా శ్రీ కంఠరావు నవ్వినాడు. లక్ష్మీదేవి చురచురలాడడం

మొదలు పెట్టింది. ఆమె నడుస్తూవుంటే దారిలోవున్న గిన్నెలూ చెంబులూ కొంచెము తాండవం చేయసాగినవి. వడ్డన పూర్తి అయింది. అతిథి విస్తరివంక చూస్తూన్నాడు. అభికరించడము మాత్రము దేవి మరిచిపోలేదు.

శ్రీకంఠుడు మందహాసముతో "ఇంకా ఏమీ కూరలు లేవా" అన్నాడు.

దేవి ఆ మాటకు నివ్వెరపోయి నిలుచున్నది.

"ఏమిరా యింజనీర్ - నాల్గుకూరలూ నాల్గుసార్లు కలుపుకోడ మెందుకురా? వేస్టఫ్టయిము - ఏకంచేస్తే వైష్ణవుల "కదంబం" అవుతుందిరా" అన్నాడు.

గొల్లుననవ్వాడు శ్రీకంఠుడు. దేవికి అర్థంకాలేదు. నేయి వడ్డించడానికి గిన్నె తీసుకొని వస్తూవుంది. మొదట నిప్పుమీదనుంచి తీసినప్పుడు అంత వేడిగా లేదు. చేయి కాలిపోతున్నది. క్రింద పెట్టి కాయితముతో పట్టుకోబోయింది. ఒలికింది. గిన్నెడు నెయ్యీ ఆ పట్టుచీరె తాగింది. దేవికి పట్టరాని కోపమూ ఏడుపూ వచ్చింది. బయట వసారాలో వచ్చి నిలుచున్నది. ఇక మళ్లీ లోపలకు రాలేదు.

వాళ్లే ఎట్లాగో తంటాలు పడ్డారు.

అతిథి "నవ్వుతూ - ఒరే ఎవరయినా ఒక ముసలమ్మనో వితంతువునో సంపాదించరా - లేకపోతే..." అన్నాడు.

"వితంతువులు లేరు. ముసలమ్మ మొగుణ్ణి వదిలిపెట్టి వుండదు"

'అయితే పాకశాస్త్రం పుస్తకానికి ఆర్డరివ్వ వలసిందే!'

"అదే ఆలోచిస్తున్నాను"

* * *

"ఏమిటా మాటలు - ఈ అడివిలో ఈ సమయంలో ఈమాత్రం అన్నం దొరికినందుకు సంతోషించమండా వెధవ వాగుడూ ఆయనా..."

"ఊఁ సరేలే. తాంబూలం ఎక్కడ వుంది"

"నే నాయనకు యిచ్చాను"

"అబ్బ"

"అబ్బ లేదు - గిబ్బ లేదు. నేను చెప్పను ఎక్కడున్నవో తమలపాకులు - వెతుక్కోండి చేతనయితే"

## 3

ఉదయం ఎనిమిదిగంట లయిపోయింది.

"ఏమండి కాఫీ చల్లారిపోతూంది. లేవరూ...అబ్బ యింకా యెంతసేపండి" అంటున్నది ఎదట యీజీచైరులో కూర్చున్న దేవి. "ఇదుగో అయిపోయింది" అంటూ కాయితాలు సవరిస్తూవున్నాడు శ్రీకంఠుడు. ఇంతలో బంట్రోతు త్వరత్వరగా వచ్చి సలాముచేసి "అయ్యా దొరగారు వస్తూవున్నారు" అన్నాడు. "మంచిదే" అంటూ వుండగానే దొరగారు వరండాలోకి వచ్చినారు. ఆయన తన బంగళాకు రావడము తనకొక పెన్నిధి వచ్చినట్టుగా యెంచుకొన్నాడు.

ఆయన రాగానే కొంచెము కోపముతోనూ విసుగుతోనూ దేవి లోపలికి వెళ్లిపోయింది.

"రావ్, ఆమె నీ యిల్లాలా" అని దొర అడిగినాడు.

"చిత్తం"

"ఇంగ్లీషు వచ్చునా?..."

"కొద్దిగా వచ్చు..."

"పేరేమిటి? ఏవూరు? డ్రస్సు మార్చి దూరాన్నించి చూస్తే నా కూతురులాగా వుంటుంది!"

"తమకు యింట్రడ్యూస్ చేస్తాను"

అత్యంతోత్సాహముతో లోపలికి వెళ్లినాడు. దేవి ముఖము మూరెడు పొడుగుచేసుకొని రావు నోట్లోనుంచి మాటరాక పూర్వమే "యింట్రడ్యూసూ గింట్రడ్యూసూ- కాఫీ చల్లారిపోయింది. ఆ చేసిన ఉప్మాకూడా చల్లారి పోయింది. నేనురాను. మీయిష్టం. పొండి. ఇక ఆ దొరతో ఏవోమాటలు పెట్టుకొని కూర్చుంటే సాయంత్ర మవుతుందో రాత్రవుతుందో!...

"చెప్పిన మాటవిను. నా మర్యాదా పోతుంది. రా. నేను కాఫీతీసుకొంటానని చెప్పి వస్తాను"

ఆమె మాట్లాడకుండా బుంగమూతి పెట్టుకొని నిలుచున్నది. ఆమె ఉదాసీనతకు రావుదేహము కంపరమెత్తిపోతూవుంది. అతని దేహములో వాయుసంచారము తీవ్రమయి పోతూవుంది. క్షణలేశములో కండ్లుతెరచి ఆమె వంక రూక్షముగా చూసినాడు. అతని కండ్లలోనుంచి నిప్పు రవ్వలు లేస్తున్నవి. "పద" అన్నాడు. మారుమాట లేకుండా ఆమెచీర సవరించుకొంటూ మందగమనముతో బయటికి బయలుదేరింది. బయటికి వచ్చేసరికి ఆమె ముఖములో హావభావాలన్నీ సంపూర్ణముగా మారిపోయినవి.

"ఈమె - లక్ష్మీదేవి - నాయిల్లాలు" అనిచెప్పి ఆమెవంక తిరిగి "వారెవరో నీకు తెలుసునుగా" అన్నాడు రావు.

దొర లక్ష్మీదేవితో షేక్‌హాండ్ చేసి "చాలా సంతోషం. నిన్ను చూస్తూవుంటే నా కుమార్తె జ్ఞాపకం వస్తూవుంది. అయితే నా కూతురికి యింకా పెళ్లి కాలేదు.' అన్నాడు.

"మీకు కూతుళ్ల యెంతమంది? ..మీకూతురు ఎక్కడ వుంది"

"నాకొక్కతే కూతురు. ఈ మధ్యనే నా సంసారాన్ని యింటికి - (అంటే యింగ్లండు) పంపివేశాను" అన్నాడు. యింకా ఏవేవో ఖులాసా కబుర్లు అన్నీ మాట్లాడినాడు. కొంతసేపయిన తర్వాత "రావు - నీవు సర్వే చేసిన వివరాలన్నీ చూదామని వచ్చాను" అన్నాడు. అంతటితో దేవి సెలవుచెప్పి లోపలికి వెళ్లిపోయింది.

శ్రీకంఠుడు కాఫీ విషయము మరచిపోయినాడు. గబగబ మ్యాపులన్నీ తీసిచూపి చూపించడము మొదలుపెట్టి ప్రాజెక్టు విషయమయి చర్చచేయడము ప్రారంభించినాడు. భర్తలేకుండా కాఫీ పుచ్చుకోడానికి దేవికి యిష్టము లేదు. భర్త ఏమో లోపలికి రాకుండా వున్నాడు. ఆకలి అవుతూవుంది. అంత మయిమగప్రతో భర్తవున్నందుకు యెంతో కోపము వచ్చింది. తన సౌఖ్యము-సౌఖ్యము ఏమిటి తానంటూ ఒకవ్యక్తి వున్నట్టే అతను గుర్తించడము లేదని తలచింది. విపరీతమయిన విచారము వచ్చింది. విచారము స్థాయిభావమూ - కోపము రసమూ అయింది.

తెల్లవాడు ఈ దేశాన్ని ఎంత పరిపాలిస్తూవున్నా యింజనీరింగు డిపార్టుమెంటులో తెల్లవాడిచేయి ఈనాటికిన్నీ నల్లవాడి చేయికిందనే వుంటూవుంది. అయితే నల్లవాండ్లు మాత్రము తెల్లవాండ్ల మర్యాదను మన్నిస్తూనే వున్నారు. ఇటువంటి సందర్భములలో శ్రీకంఠుడు ఏమి చేస్తాడు. తనపై అధికారి- దొర - పయిగా తన యింటికి వచ్చినాడు. అతనిపని చక్కబెట్టనిదే లోపలికి వచ్చి కాఫీ ఎట్లా తాగుతాడు?

శ్రీకంఠుడు లోపలికి వచ్చేసరికి పదిగంటలయింది. దేవి మంచముమీద బోర్లా పడుకొంది. ఆమెను లేపడానికి ప్రయత్నము చేసినాడు. బిగదీసుకొని పోయింది. లేవలేదు. అతను లోపలికి పోయినాడు. కాఫీ చప్పగా చల్లారిపోయింది. పొయ్యి వంకచూసినాడు. నిప్పు ఆరిపోయి వుంది. కొంచెం ఉప్మా నోట్లోవేసుకొన్నాడు. ఆ చల్లారిన కాఫీ యింత తాగినాడు.

ఇదంతా దేవి ఓరకంట కనిపెడుతూనే వుంది. అతను యివతలకు వచ్చేసరికి యథాప్రకారముగా దేవి పడుకొని వుంది. ఆమెను ఏమీ కదిలించకుండానే మళ్లీ తన కుర్చిలో చతికిలబడి ప్రాజెక్టుప్లాన్లు తీసినాడు. అతని చిత్తమంతా క్షణలేశములో దానిమీద లగ్నమయి పోయింది. అతని భౌతికదేహము మాత్రము అక్కడవుంది. మనస్సంతా ఏదో లోకములో వుంది.

దేవి ముఖము చిట్లించుకొంటూ కాఫీతో అతని యెదటికి వచ్చి చూసింది. అతనామెను గమనించేట్టు తోచలేదు. ఒళ్లు భగ్గున మండిపోయింది. "వెధవ కాఫీ పదిగంటలు దాటిపోయింది. చల్లారిపోయింది. ఇది తాగడమెట్లా?" నంటూ గిన్నెడు కాఫీ విసురుబుచ్చుకొని అవతల పారబోసింది.

అతను నిద్రలోనుంచి ఉలిక్కిపడి లేచినవాడిలాగా ఆదృశ్యాన్ని చూసినాడు. ఇంక అదేవిధముగా ఆమెవంక చూడసాగినాడు. తన్ను అతను చూస్తూవున్నట్టు తెలుసును. కాని ఆమె ఆ సంగతి తెలియనట్టే మూతి ముడుచుకొని ఏడుపు మొఖము పెట్టుకొని లోపలికి వెళ్లిపోయింది.

శ్రీకంఠుడు కదలకుండా మెదలకుండా అట్లాగే కూర్చున్నాడు. అటు ప్రాజెక్టుప్లానుల మీదికి బుద్ధి పోయేట్టు లేదు. ఇటు భార్యకు సాంత్వన వాక్యాలు చెప్పి బుజ్జగించడానికి అంతకుముందే మనస్కరించడము లేదు. ఒక విధమయిన శూన్యహృదయముతో కూర్చున్నాడు. అతనిబుద్ధి ఎటూ పాలుబోలేదు.

ఒక అరగంట అయింది. దేవి అతని యెదుట వచ్చి నిలుచున్నది. కొంచెము ప్రసన్న మామె ముఖములో తోచింది. శ్రీకంఠుడు కూడా కించిన్మందహాసముతో ఆమెను చూసినాడు. ఆమె ముఖము వెంటనే వివర్ణమయి పోయింది. మళ్లీ మాతి బిగబట్టి "పదకొండు గంటలు అవుతున్నది ..అట్లా కూర్చుంటే సరి. అన్నంలోకి ఏం చేయమన్నారో చెప్పండి" అన్నది.

"ఏదో ఒకటిచేయి"

"నాకలా తెలియదు. ఫలానా అని చెప్పండి"

"ఏదో ఒకటి త్వరగా చేస్తూ, పరవాలేదు"

"అవును ఇప్పుడిల్లాగే అంటారు. తర్వాత విస్తరి దగ్గిర కూర్చున్నంత సేపూ ఏవో వంకలు పెడతారు"

అతను ఏమీ మాట్లాడలేదు. ఆమె యెంతో కోపముతో "మీరు చెప్పకపోతే నేను అసలు వండనే వండను" అన్నది.

అతనికి కోపము వచ్చింది. "పోనిలే" అన్నాడు.

"మీరు పస్తుండగలరేమో నేనుండలేను"

"అయితే నీయిష్టం వచ్చింది చేసుకుతిను. నాకక్కర లేదు"

"ఎందుకండీ అంత కోపం?"

"నాకు కోపంలేదు"

"అయితే చెప్పండి అన్నంలోకి ఏంచేయ మన్నారో?"

"నాకు తోచడంలేదు"

"అయితే నేను వంట చేయను"

"మరీ మంచిది"

"సరే" నంటూ లోపలికి దేవి వెళ్లింది.

## ౪

రాత్రి పదకొండు గంటలు కావస్తూ వుంది. శ్రీకంఠుడు పెద్ద దయ్యములాంటి లస్టరు దీపంముందు కూర్చుని 'ఫ్రూల్స్ కాల్ కులస్ - బాంబే స్పెసిఫికేషన్సు' అనే పుస్తకాలు తెరిచి అతి తీవ్రముగా చూస్తూవున్నాడు.

అంతవరకూ బిగదీసుకొని పోయిన వాయుదేవుడు అప్పుడే మళ్లీ సంచారానికి బయలుదేరినాడు. వాయుసంచారము దక్షిణమునుంచి కొంచెము మంద మందముగా సాగింది. కిటికి దగ్గిర పట్టెమంచముమీద పడుకొన్న దేవి చాలా సేపటినుంచి మసులుతూ వుంది. సంబోధిస్తే తప్ప శ్రీకంఠుడు అటు చూచేట్టు లేడు. ఆమెలేచి అటూ ఇటూ పచారు చేసింది. అత నామెను గమనించనే లేదు. మళ్లీవచ్చి మంచముమీద కూర్చున్నది. ఎంతసేపటికీ అత నామెవంక చూడనేలేదు. లేచివెళ్లి పెట్టెలు చప్పుడు చేస్తూ తెరిచింది. అతనికా చప్పుడు వినిపించనే లేదు. సన్నని తెల్లచీర తీసి అతని దీపము దగ్గిరకుపోయి ఏదో పరీక్ష చేయడము మొదలుపెట్టింది. లాభము లేక పోయింది. అతను తల యెత్తనేలేదు.

ఆమె పాము కుబుసము లాంటి చీరె కట్టుకొన్నది. ఆమె సహజలావణ్యము ఆచీరెలోనుంచి తొంగిచూస్తూ వుంది. గదిఅంతా ఘుమఘుమ లాడుతున్నది. వాయుసంచారము తీవ్రము అవుతున్న కొద్దీ ఆమెకు కోపము హెచ్చుతూ వుంది. చెప్ప నలవికాని కోపముతో ఆ మంచముమీద వాలింది. అటూ యిటూ పొర్లిగింతలు పెట్టింది. గడియారముచూసింది. పన్నెండు అవుతున్నది... ఇక వూరుకో లేకపోయింది.

'ఏమండోయ్' అన్నది. అతను పలకలేదు. ఏమండోయ్ - మిమ్మలనే... పలకరేమండి... నేను చచ్చిపోతున్నాను." అన్నది.

అతను నిద్రావస్థలోనుంచి జాగ్రదవస్థలోకి వచ్చినట్టుగా ఆమెవంక వెర్రిగా చూసినాడు.

"ఏమిటండీ - అలా చూస్తారు? ఆదీపం నాకళ్లు కుడుతున్నది. తలనొప్పితో చచ్చిపోతున్నాను... ముందా దీపం ఆర్పివేయండి. నేను భరించలేను"

ఆమెను తేరిపార నఖశిఖ పర్యంతమూ చూసినాడు. అతను చూస్తూవుంటే ఆమెకు సిగ్గయి దేహాన్ని కుంచిస్తూ తల కొంచెముగా వంచుకొని అరకంట చూస్తూ "ఆ దీపం ఆర్పేస్తారా - ఆర్పేయరా" అని గద్దించింది.

అతడు మందహాసముతో "ఆర్పేయ డానికి వీలులేదు. ఇంకా ఒక్క అరగంటసేపు యీ పుస్తకం చూడవలె" నన్నాడు.

"మీరు ఆర్పివేయకపోతే నేను ఆర్పేస్తాను"

"ఆర్పివేయనీయనుగా

"దీపం ఆరదూ--ఆర్పుతాను" మాట పూర్తిచేయకుండానే మంచముమీద నుంచి చెంగున దూకింది. గాఢాంధకారమయి పోయింది. అప్పటికి చంద్రుడు నడినెత్తిమీదికి వెళ్లిపోయినాడు. బయట వరండాలో మాత్రము వెన్నెల పిండి ఆరబోసినట్లుగా వుంది.

కంటికి ఆ చీకటికాస్త అలవాటయ్యే సరికి అక్కడ దేవి కనుపించలేదు. శ్రీకంఠుడు నాల్గు మూలలా పరికించి చూసినాడు. ఆమె కనిపించలేదు. వస్పున స్ఫురణకు వచ్చి బయటికి వచ్చినాడు.

వరండాలో మంచముమీద అడ్డముగా దిండులాగా దేవి పడుకొని వుంది. ఝంఝూమారుతము వీస్తూవుంది. ఆ గాలికి దేహములో రక్తప్రసారము తీవ్రము-అవుతూ వుంది. అతను మందహాసముతో అత్యంతోత్సాహముతో ఆమెను తలగడా లాగానే భావించి మంచముమీద వాలినాడు. ఆమె వక్షోజాలను అతని బిరుసైన శిరోజాలు కిలికించితము చేయ మొదలు పెట్టినవి. ఆమె తుళ్లిపడ్డది.

"ఓ నీవు యిక్కడకు వచ్చి దాక్కొన్నావా?" అంటూ సవిరించ బోయినాడు. ఆమె అక్కడనుంచి లేచి పారిపోవడానికి ప్రయత్నము చేయసాగింది. ఆమెనయితే నిర్బంధించినాడు. కాని ఆమె ఎందుకు పారిపోవలెననే ప్రయత్నము చేస్తున్నదో మాత్రము బోధపడక కొంత ఆశ్చర్యము కలిగింది.

♦ ♦ ♦

"అబ్బ-పాడు యినుప మనుషులండి...ఇంక బ్రతకను...అమ్మయ్యో..."

"అల్లరిదానా..."

"చాలు...చాలు...అమ్మా-అమ్మా...బాబోయ్...వుండండి..."

* * *

అతని కౌగిటలోనుంచి చటుక్కున తారాచువ్వలాగా దేవి లేచింది. లోపలికిదూకింది. తలుపులు ధబీమని వేసివేసింది.

శ్రీకంఠుడు ఆలోచిస్తూ మెల్లిగా లేచి బయలుదేరినాడు. తలుపు లోపలగడియవేసివుంది. వెనకవైపు తలుపులోపల గడియవేసివుండదని త్వరితముగా వెనకవైపుకు వెళ్లినాడు. ఆశాభంగము అయినది.

మళ్లీవచ్చి వరండాలో మంచముమీద కూర్చున్నాడు. ఆలోచనా పరంపరలలో మునిగి తేలుతున్నాడు. పంచభూతాలను ధిక్కరించి రాజ్యము చేయుగలుగుతున్న యింజనీరు: కాని యీ విషయములో తూర్పు పడమరలు మాత్రము తెలియడం లేదు.

లోపల దేవిమూలుగు వినపడుతూవుంది. "నిజంగా, యీ వ్యవహారము యింతబాధ కలిగించేట్లయితే నన్నింత పురికొల్పడ మెందుకు?" అనుకొన్నాడు. "ఏమో ఇదే మిటో అంతుబట్టడం లేదు." అనుకొంటూ మంచముమీద వాలినాడు. నిద్రపట లేదు. నిద్రపట్టేట్టూ లేదు. కళ్లు మిటకరించుకొని శూన్యహృదయముతో అట్లా వెల్లకిలా పడుకొన్నాడు.

ఎంత టయిమయిందో అతనికి తెలియదు. అతని హృదయము శూన్యము అవుతూవున్నకొద్దీ గాలి మందగించడము మొదలుపెట్టింది. చివరకు గాలి నిలిచిపోయింది. యావత్తు జగత్తూ స్తంభించిపోయినట్లుగా వుంది.

తలుపు చప్పుడయింది. దేవి లోపలినుంచి బయటికి వచ్చింది: దూరమునుంచి కోడికూసింది. ఆ కూతకు అతని చెవులు గింగురెత్తిపోయినవి. ఆమెను పలుకరించలేదు. అట్లాగే పడుకొని ఆమెను చూడసాగినాడు. అతనివంక చూడకుండానే దేవి "రాక్షసులు...వూరుకొంటే అదే రోజుల పర్యంతమూ వూరుకోడం...కదిలిస్తే రాక్షసిలాగా, రెక్కిగీరి, చంపివేయడం...అబ్బ యింట్లో గాలిలేదు...చచ్చిపోతున్నాను...ఏమండోయ్ మాట్లాడరేం...కాస్త లేచి ఆయీజీచైరు యిలా బయటికిలాగిపెట్టండి. అందులో వాలుతాను. అబ్బ నా నడుములు పడిపోయినవండి. నేను నిలుచోలేను"...అన్నది.

"ఇలారా...యిక్కడ పడుకోవచ్చు..."

"బుద్ధిగల దెవతే మీ సమీపానికి రాదు."

అతనేమీ మాట్లాడలేదు. ఆమె మెల్లిగా లోపలికి వెళ్లి పడకకుర్చీ వరండాలోకి లాక్కొని వచ్చి అందులో జారగిల బడింది. కళ్లుమూసుకొని "అబ్బ...అమ్మ..." అని మళ్లీ కళ్లుతెరిచింది.

శ్రీకంఠు డామె ఎదట నవ్వుతూ నిల్చొనివున్నాడు. "అమ్మో...అమ్మో... చచ్చిపోతాను. ఇందుకే యీ అడివిలోకి తీసుకొచ్చారు...లోపల గాలిలేక వచ్చానండి.

నన్ను బ్రతకనీయరూ" అంటూ మూడంకెలాగా ముడుచుకొని పడుకొన్నది. అతను పసిపాపను రెండు చేతులతో తొట్టెలోనుంచి లేవనెత్తినట్టు లేవనెత్తి ముద్దుపెట్టుకొన్నాడు. ఆ చేతులలోనుంచి జారిపోవలెనను కొంది. అయితే అంత యెత్తునుంచి కిందబడితే ఒళ్లు విరిగిపోతుందని భయము వేసింది. బ్రతిమలాడడము మొదలు పెట్టింది. అతను విలాసముగా నవ్వుతూ మంచముమీద ఆమెను వదిలినాడు.



ప్రాజెక్టు స్కీము ప్రభుత్వమువారు అంగీకరించి వెంటనే పని ప్రారంభించమనిన్నీ - యిన్వెస్టిగేటు చేసినవారినే ప్రాజెక్టు తయారు అయ్యేవరకున్నూ ఉద్యోగస్తులుగా వుండమనిన్నీ ఉత్తరువు చేసినారు.

ఈ వర్తమానానికి శ్రీకంఠరావు యెంతో సంతోషించినాడు. తన ప్రతిభ బయటపడేరోజులు వచ్చినట్టు వుప్పొంగిపోతున్నాడు. కండ్లు మూసి తెరిచేలోపల ప్రాజెక్టు కంట్రాక్టు యివ్వడమూ పని ప్రారంభము కావడమూ అయిపోయింది. పని అంతా బండపని. అందులో నిర్మాణ కౌశల్యము ఏమీ లేదు. మట్టి తవ్వడమూ మట్టములు చూడడమే ముఖ్య.

మయినపని. సూర్యోదయము అయ్యేసరికి లేచి పని చూడడానికి వెళ్లవలెను. అతను పనిలోకి వెళ్లిన తర్వాత యెప్పుడు మళ్లీ యింటికి చేగడమో యెవరికీ, తెలియదు. అతనికి ఆకలి యెందుకు వేయదో అది దైవానికి తెలియవలసిందే! ప్రాజెక్టు నిర్మాణము ప్రారంభమయినప్పటినుంచి అతనికొక యిల్లు వున్నదన్న విషయముకూడా జ్ఞాపకములేకుండా పోయింది.

లక్ష్మీదేవి రోజురోజుకు బలహీనమయి పోతూవుంది. దేహదార్ఢ్యము తగ్గిన కొద్దీ ఆమెకు కోపము యెక్కువయి పోతూవుంది. ఉదయము మొదలు సాయంత్రము మూడు గంటల వరకున్నూ అట్లాగే ఒంటరిగా యింట్లోవుండడము తప్ప మరొకపని లేదు. ఏదయినా చదువుకొందామన్నా ఒక్క నవలకాని కథలపుస్తకము కానీ లేదు. అన్నీ యింజనీరింగ్ పుస్తకాలు. వచ్చే పత్రికలయినా మామూలు వార్తాపత్రికలు కావు: అన్ని యింజనీరింగ్ పత్రికలే... దేవి అతనితో తాను చదువుకోడానికి ఏవయినా పత్రికలుకానీ పుస్తకాలుకానీ కావలెనని అయినా చెప్పలేదు. అతనికా అట్లాంటి విషయము బుర్రలోకి యెప్పుడున్నూ రాలేదు. వస్తుందనే నమ్మకమయినా లేదు.

ఆమెకు చిరాకూ - చికాకు యెక్కువయి పోయిందని అతనికి తెలుసును. అయితే యెందుకామె అట్లా వుంటూవుందో అతని వూహకు అందలేదు. ఎన్నిసార్లు ఆలోచించినా అతనికి కారణము తట్టలేదు. పనిలోనుంచి యింటివైపు మళ్లగానే అతనికివచ్చే వూహయిదే - యెన్ని విధాలనో ఆలోచించే వాడు. తన్నుతీసి యెదుట నిలుచోబెట్టి మరొకణ్ణి పరీక్ష చేసినట్టుగా పరీక్ష చేసుకొనేవాడు. కాని తనలోపమేమిటో అర్థమయ్యేది కాదు.

మధ్యాహ్నము మూడు గంటలవుతూ వుంది. నురుగులు పడుతూ ఆదరా బాదరా శ్రీకంఠుడు యింటికి పరుగెత్తుకొని వచ్చినాడు. వర్షముకురిసి చాలా రోజులయి నప్పటికిన్నీ అతెన్ని చూస్తేమాత్రము వర్షములో సంపూర్ణముగా తడిసి పోయిన వాడిలాగా కనపడుతున్నాడు.

లక్ష్మీదేవి తలకొక గుడ్డ బిగించుకొని మంచముమీద పండుకొని వుంది. అతను ఆమెదగ్గరికి పోయి మృదువుగా తడుతూ "ఏమిటి...అసలేదయినా జబ్బు ప్రవేశించిందా? ... నెలరోజుల నుంచి యిలా బాధపడుతున్నావు...నీ బాధంతా ఏమిటో చెప్పు..." అని అతి మృదువుగా ప్రశ్నించినాడు. ఆమె కొరకొర లాడుతూ అతనివంక చూసి "నేనొకదాన్ని బ్రదికి వున్నానని తమకిప్పుడు జ్ఞాపకం వచ్చిందా?" అన్నది.

అతనేమీ మాట్లాడకుండా అలాగే నిలుచున్నాడు.

"నేను వంటచేయలేక పోయినాను. నౌఖరు తెచ్చిన రెండూ రొట్టెలలోనూ ఒకరొట్టె యెట్లాగో కాల్చుకు తిన్నాను. ఇంత కాఫీ తాగాను."

"అయితే యింకోరొట్టె వుంది కాదూ?"

'మీరు యింతఅన్నం వుడకవేస్తారేమో ననుకొన్నాను

"నాకిప్పుడు తీరదు. చాలా పనివుంది."

ఆమె ఏమీ మాట్లాడకుండా మంచంమీద వాలింది. లోపలికిపోయి రొట్టెతెచ్చుకొని అపచ్చిదే పీక్కొని తింటూ ఏవో ప్లాను చూడడము మొదలుపెట్టినాడు. ఆమె అతన్ని గమనిస్తూనే వుంది. ఆమె రక్తము వేడెక్కిపోతూవుంది. అతన్ని అమాంతం పట్టుకొని కొడదామా అన్నంత కోపం వచ్చింది. ఆమెకు తలతిరిగి పోతూవుంది. అతనామెవంక చూడనయినా లేదు.

కొంత సేపటికి ఆమె మూలుగు తున్నట్టుగా అతనికి తోచింది. మంచమువైపు చూసినాడు. ఆమె గోడవైపు ముఖము పెట్టుకొని వుంది. "ఏం...ఏమిటి చాలా బాధగా వుందా?...ఎందుకు మూలుగుతావు" అన్నాడు.

గద్గద కంఠముతో "నేను బ్రతికి వున్నానని మూలుగుతున్నాను" అని ఆమె జవాబు చెప్పింది.

అతనిక ఆమెవంక చూడలేదు. ప్లాన్ల కాయితాలన్నీ చుట్టి చంకను బెట్టినాడు. ఆమెతో చెప్పనయినా చెప్పకుండా ఆ మంచము వంకనయినా చూడకుండా ఆ తడిసిన చొక్కాతోటే ఆవచ్చిన విధంగానే బయటికి నడిచినాడు.

ఆమె అట్లాగే మూలుగుతూ ఒక పావుగంట సేపయిన తర్వాత యిటు చూసింది. అతనక్కడలేడు. మెల్లిగా లేచింది. బయట వసారాలోకి వచ్చి చూచింది. శ్రీకంఠుడు దూరాన కనిపించినాడు. అతను భూదేవి గజగజలాడేటట్టు నడుస్తూ వున్నట్టుగా తోచింది. కళ్లవెంట అప్రయత్నంగా నీళ్లు కారుతున్నవి. ఎట్లాగో హృదయము చిక్కబట్టి లోపలికి వచ్చి పడకకుర్చీలో కూల

బడ్డది. ఆమెకు తెలియకుండానే పసిపిల్లలాగా ఏడవ సాగింది.

ఆ నిర్జన ప్రదేశములో ఆమె రోదనాన్ని వినేవాళ్లెవ్వరున్నారు? ఏడ్పుకు ఆయిల్లు ప్రతిధ్వనిస్తున్నది. ఆ బంగళా ఆరోదన ధ్వనికి కదలిపోతున్నదా అనిపిస్తున్నది. అక్కడామెను ఓదార్చేవారెవరున్నారు?...అయితే ఆమెను ఓదార్చడానికి మేఘాలు పరుగెత్తుకొని వస్తూ వున్నవి.

అనతికాలములో భూమి చల్లబడి పోయింది. ఆమె ఏడ్పుకు విరామము కలిగింది. కొంచెము పరికించి చూచింది. ఆకాశమంతా మబ్బు పట్టివున్నట్టు గోచరించింది.

ఆమెకు అంత దుఃఖములోనూ కొంచెము ఉపశమనమయింది. జల్లుపడితే చాలు పని ఆగిపోతుంది. పెనిమిటి వెంటనే యింటికి వస్తాడు. ఈ ఆలోచన వచ్చింది. అప్పుడే జల్లు ఆరంభమయింది.

## ౬

"ఇలా అయితే యిక బ్రతకడం కష్టమే...ఏమిటి యిల్లంతా అయ్యవార్లంగారి సట్టిల్లల్లే చేశావు"

"అప్పటికయినా మీకు యింటిగోల పడుతుందేమోనని..." అన్నది దేవి.

"నీ గొడవ ఏమిటో నాకర్థం కావడంలేదు. ఇంట్లో వండుకోడానికి ఒక్క వస్తువయినా లేదు. మరి నాదగ్గిర ఒక్క దమ్మిడీ అయినా వుంచుకోకుండా యిచ్చివేశానే" అన్నాడు బియ్యము కడిగి పొయిమీద పెడుతూ శ్రీకంఠుడు

"అవును మీ జీతమంతా మావాళ్లకు మూటకట్టి పంపివేస్తున్నాను" అంటూ తలకింద వున్న పర్సుతీసి అతని దగ్గిర పడేట్టుగా గిరాటు వేసింది. అది అతని కాళ్లదగ్గిర పడింది. అతను కొంచెము కోపముతో కిందవున్న పర్సుతీసి గూట్లోపెట్టి మళ్లీ వంటవిషయము ఆలోచిస్తున్నాడు.

వంటలోకి ఒక వస్తువుంటే యింకొకటి లేదు. ఎట్లాగో ఆపూటకు నాలుగు బియ్యాపు గింజలూ పొంగించినాడు. దేవిని లేవమన్నాడు. ఆమె అతన్ని తదేకంగా చూసి "నాకు ఆకలిలేదండీ...అసలు ఆకలి పోయింది. అన్నాన్ని చూస్తే అసహ్యమండి." అన్నది.

"మరేం పరవాలేదులే సయించినంత వరకే తిను."

"నేను తర్వాత తింటాను. మీరు ముందు తినండి"

"అలా కాదు. లే తిందాముగా"

"నేనురాను. మీ కిష్టమయితే తినండి. లేకపోతేలేదు"

అతనికామె పద్ధతియేమీ అర్థము కాలేదు.

"నీవు లేస్తేగాని వీలులేదు"

"నేనిప్పుడు లేవలేను"

"అయితే నాకున్నూ యిప్పుడు అక్కరలేదు"

"నేనసలు తిననే తినను"

"అయితే నేనూ తినను"

ఆమె మాట్లాడకుండా అట్లాగే పడుకొంది. అతను ఒక క్షణముసేపు నిలుచున్నాడు.

"నేను పనిలోకి వెళ్లాలి. లే. సయించినంత వరకూ"

"ఏమిటండీ ఆ మొండితనం..."

"నాకదంతా తెలియదు. నీవు లేస్తావా-లేవవా?"

ఆమె అటుతిరిగి పడుకొంది. అతను వెంటనే పార్ట్సు వేసుకొని చొక్కా తొడుగుకొని బయలుదేరి పనిలోకి వెళ్లి పోయినాడు.

అతను వెళ్లిపోవడ మామెకు తెలుసును. అతన్ని వారించడానికి ఏమీ ప్రయత్నము చేయలేదు. అతను కంటికి కనబడేవరకూ కిటికిలోనుంచి చూసి ఆతర్వాతలేచి వంట గదిలోకి వెళ్లి వంటకమునుమీద మూతలు గీతలు పెట్టి జాగ్రత్తచేసి మళ్లీవచ్చి మంచముమీద వాలింది.

గడియారం పదకొండు గంటలు కొట్టింది. ఆమె దగ్గిర వున్న కూజాలోవి కాసిని మంచినీళ్లుతాగి పడుకొంది. వెంటనే నిద్రపట్టింది...

## ౨

సాయంత్రము అయిదుగంట లప్పుడు శ్రీకంఠుడు యింటికి చేరినాడు.

దేవి స్నానము గీనము చేసి ముస్తాబయి వుంది. గాలి పటంలాగు ఎగరడానికి సిద్ధంగా వుంది. శ్రీకంఠుడు నిర్ఘాంత పోయినాడు.

"ఏమండీ - మన్ను కొట్టుకొని వచ్చినారు. చప్పున స్నానం చేయండి, నీళ్లు చల్లారిపోతవి కూడాను" అన్నది. అతనికేమీ తోచలేదు. అయోమయంగా వుంది యీ చర్యఅంతాను. అతనూ స్నానముచేసి ముస్తాబు కావడమా ఆత్మరాముణ్ణి సంతృప్తి పురచేడానికింత చద్దిఅన్నము అయినా వేయడమా అని ఆలోచిస్తున్నాడు.

దేవి అది కనిపెట్టి "కాస్త అలా షికారు వెళుదాం. తర్వాత వచ్చి భోజనం చేదాం" అంది.

"సరే" నని ఉభయులూ బయటికి బయలు దేరినారు. పది పదిహేను రోజులనుంచి ప్రతిరోజూ ముడుచుకొని పడుకొన్న దేవికి యింత హఠాత్తుగా యింత ఆరోగ్య మెట్లా వచ్చిందో బోధ పడలేదు.

ఆలోచించగా ఆలోచించగా అతనికి కాలేజిలో చదువుకొంటున్న రోజులలో సహోధ్యాయి అప్పు డప్పుడు పాడిన 'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అనే పద్యం జ్ఞాపకానికి వచ్చింది. అంతకన్న దూరమాతని ఆలోచన పోలేదు. ఖులాసాగా చెట్టా పట్టాలు పట్టుకొని నడుస్తున్నారు. కాని మాటలలోకి దిగలేదు. ఏమని ఆరంభించడానికీ శ్రీకంఠుడికి తోచలేదు. తవ్వుతున్న చెరువు దగ్గిరకు రాగానే భర్త వంక సాలోచనముగా చూస్తూ "ఏమండీ - యిన్నాళ్లనుంచి అయిన పని యింతేనా?" అన్నది.

అతనూ నవ్వుతూ 'అవును.' అన్నాడు అంతే. నీవు అడిగేది చూస్తే వెనకటికి ఒకామె రావిచెట్టుకు ప్రదక్షిణాలు మొదలెట్టి ప్రతి ప్రతిక్షిణానికి కడుపు తవిడి చూసుకొన్నదట"

"అలాగా... పోనిలెండి. యింకా యిన్నాళ్లకీ పని అవుతుంది?"

"ఒక సంవత్సరము పడుతుంది"

"అయితే వర్షాల…భం కాగానే యిక నీవుట్టి పని అంతా అపుదల చేయడమేనా?

"ఆఁ కొంతవరకూ"

"అయితే పని ఆపివేస్తే మనం మళ్లీ టవుౝలోకి వెళ్లి పోతామా?"

"నమ్మకం లేదు"

ఆమె మళ్లీ కొంచెము సేపు మానము వహించి "ఇప్పటికి మా అమ్మా నాన్నను చూసి చాలా రోజులయిందండి" అన్నది.

"నాల్గు మాసాలేగా"

"చాలదుటండి"

"సరే నయితే... యిప్పుడేమిటి నీ అభిప్రాయము?"

"ఇంటికి వెళ్లి చూచివద్దాం"

"వాళ్లు రమ్మని అయినా వ్రాయలేదే?"

"మీరు పంపుతారో పంపరోనని వ్రాయలేదు లెండి"

"అడగందే వాళ్లకట్లా తెలిసిందో"

"మీరు వాళ్లకు ఒక్క వుత్తరమయినా వ్రాశారా"

"నీవు వ్రాస్తున్నావు: చాలదూ"

"సరే పోనీయండి మనం మాయింటికివెళ్లి వద్దామండి"

"నాకు సెలవదొరకదు. నీవు పోవలెనను కొంటే పోయిరా."

"మీరుకూడా రావలసిందే తప్పదు."

"సాధ్యముకాదులే."

"అయితే నేను వెళ్లను"

"పోనీ మానివేసెయ్యి"

ఆమె కోపముతో మూతి ముడుచుకొనని నడవడము మొదలుపెట్టింది. అతను మందహాసముతో ఆమెను చూస్తూ ఏమీ మాట్లాడలేదు. ఇంటికి చీకటిపడిం తర్వాత చేరినారు

* * *

"మీకు కోపం వస్తుందేమోనండి"

"కోపమెందుకు... మనస్సులో వుంది చప్పున చెప్పితే యోంతోషిస్తాను"

“ నేనిక్కడ వుండలేనండి ”

“ అంటే నాకేమిటో బోధపడడం లేదు ”

“ ఏమిటో నాకు తెలియదు. నేనూ యిదీ కారణము అని చెప్పలేను. నాకు యిరుగూ పొరుగూ లేరనే బాధ లేదు. అసలు నేనెప్పుడూ ఒంటరిగా వుండడానికే యిష్ట పడుతాను. మరెందువల్లనో యిక్కడ వుంటే పిచ్చెత్తి నట్టుంటూ వుందండి ”

“ అయితే ఏమి చేదామంటావు ?”

“ మాయింటికి వెళ్లి ఒక్క నెలరోజులు వుండి వద్దాము ”

“ నేను రావడానికి వీలులేదు...రాను నీవువెళ్లి ఒకటి కాదు రెండు మాసాలుండిరా...

“ మీరు లేకుండా నేనుండలేనండీ ”

“ అయితే యిక్కడే వుండు ”

“ ఇక్కడ మీతో వుండలేను. పుట్టింటికి పోతే మీరు లేకుండా వుండలేను ” అంటూ పక్కలో పడుకొన్న దేవి ప్రార్థించడము మొదలు పెట్టింది. అతనిక మాట్లా డడము మానివేసినాడు. ఇద్దరూ అన్యోన్యము చూసు కొంటూ ఎవరికి వారు ఏదో భావప్రపంచములో విహా రము చేస్తున్నారు.

కొంతసేపయిన తర్వాత శ్రీకంఠుడు ఆమెవైపు పృష్ట భాగము పెట్టి పడుకొన్నాడు.

ఆమె అది చూసి “ ఏమండోయ్ - మీరటు తిరిగి పడుకోడానికి వీలులేదు. ఇటు తిరగండి...” అన్నది. అతను యీవైపు మళ్లలేదు. భుజము పట్టుకొని ఇటువైపు తిప్పడానికి ప్రయత్నము చేస్తూ “ యిటు తిరగరు కాదూ. మీరటు తిరిగి పడుకొంటె నాకు నిద్రపట్టదండి ” అన్నది.

అతను చటుక్కున ఆమెవైపు తిరిగినాడు. అతనిముఖము మీద మందహాసము తాండవము చేస్తూ వుంది. నవ్వుతూ “ తిరిగాను ” అంటూ ఆమెవంక సాంగముగా చూసి నాడు. ఆ చూపులకు ఆమెదేహము కంపించిపోసాగింది. “ అబ్బ...మీతో ఇదే చావండి...వూరికా...అయితే నేను యిక్కడ పడుకోనే పడుకోను ” అని అమాంతము లేవ బోయింది. కాని సాధ్యము కాలేదు. (సశేషము)

